క్లుప్తంగా

క్రీడాకారులకు మంత్రి జోగి రమేష్ అభినందన



ఇబ్రహీంపట్నం: ప్రపంచ సిలబం(కర్రసాము) చాంపియన్ షిప్ క్రీడాకారులకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అభినందనలు తెలిపారు. ఇటీవల బెంగళూరులో జరిగిన సిలంబం ప్రపంచ చాంపియన్ షిప్‌లో పతకాలు సాధించిన నగరానికి చెందిన పలువురు క్రీడాకారులు సోమవారం మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. పురుషుల సీనియర్ విభాగంలో కె.సత్యశ్రీకాంత్ సింగిల్ స్టిక్ ఫైట్, కత్తి ప్రదర్శనలో మూడు పసిడి పతకాలు, డబుల్ స్టిక్‌లో రజిత పతకం, బాలికల జూనియర్ విభాగంలో హియా ముఖేష్‌జైన్ సింగిల్, డబుల్ స్టిక్‌లో రెండు కాంస్యం, వి.సాత్విక్ రజిత పతకం సాధించినట్లు మంత్రికి వివరించారు. మంత్రి జోగి రమేష్ క్రీడాకారుల మెడలో మెడల్స్ వేసి అభినంధించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, జోగి రాము, నాగిరెడ్డి, మధు పాల్గొన్నారు.

సైకిల్ వాడకంతో శారీరక ఆరోగ్యం



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రతి రోజూ సైకిల్ వినియోగించడం ద్వారా శారీరక ఆరోగ్యం కలుగుతుందని గుంటుపల్లి కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ పీవీఎస్ఆర్ కృష్ణ అన్నారు. కేంద్ర విద్యా విధానం 2020పై నిర్వహిస్తున్న స్థానిక కేంద్రీయ విద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జన్భాగీదారీ పక్షోక్షవాల్లో భాగంగా సోమవారం సైకిల్ ర్యాలీ నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరంలో నూతన కోదండ రామాలయం, విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య సీతారామచంద్ర స్వామి, లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ విశిష్ఠ పూజలతో జరిపారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ కోదండ రామాలయం ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్నారు. అర్చక బృందం సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద ఆశీస్సులు అందజేశారు. ఆలయ నిర్మాణ దాత బోడేపూడి అప్పారావు, గ్రామ సర్పంచ్ రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ రంగస్వామి, పాలడుగు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సి.నారాయణరెడ్డికి ఘన నివాళి



పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలనులో సోమవారం షిరిడీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, సాహితీవేత్త, సినీ పాటల రచయిత సింగిరెడ్డి నారాయణరెడ్డి వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు వివిధ సబ్జెక్టులు బోధించిన ఉపాధ్యాయుడు తోట నాగరాజును సన్మానించారు. ఉస్మానియా యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ రామాల నాగేశ్వరరావు, విశ్రాంత ఎంఈఓ వి. శేషిరెడ్డి, గ్రంథాలయాధికారి వి జ్యోతిర్మయి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఏవీ నరసింహారావు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించొద్దు



గానుగపాడు(తిరువూరురూరల్): 14 సంవత్సరాల లోపు పిల్లలను చదువు మాన్పించి పనులకు పంపడం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రుల బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించవద్దని కోరుతూ మండలంలోని గానుగపాడులో సోమవారం ఉపాధ్యాయులు అవగాహన ప్రదర్శన జరిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠశాల హెచ్‌ఎం ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు గ్రామంలో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు.

నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి





గంపలగూడెంలో జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి, మైలవరంలో విద్యా కానుక కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత

గంపలగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యనందించేందుకు రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగుళ్లగా కృషి చేస్తోందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి అన్నారు. గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లల చదువు తల్లిదండ్రులకు భారం కాకూడదన్న ఆశయంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు అన్ని వసతులను ప్రభుత్వం ద్వారానే కల్పిస్తున్నారన్నారు. ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించే ఒక్కో విద్యార్థికి రూ.2,500 ఖర్చు చేసి రాష్ట్ర ప్రభుత్వం జేవీకే కిట్లను పంపిణీ చేస్తోందన్నారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్సులు, బూట్లు, టై, బెల్ట్, సాక్స్, బ్యాగ్, డిక్షనరీలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గంపలగూడెం మండలంలోని 73 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 5,160 మందికి ఈ కిట్లను ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు నరసింహారావు, ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, ఎంఈఓ సోమశేఖర్‌నాయక్, హెచ్‌ఎం ఎస్ జమలయ్య పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

మైలవరం: కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా సర్కారు బడులు నిర్వహించడం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కొనసాగుతుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాల, చంద్రాల జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లను ఎమ్మెల్యే అందజేశారు. పాఠశాలలు ప్రారంభం రోజునే విద్యార్థులకు జగనన్న విద్యా కిట్లు అందజేయడం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తమ పాలనకు ఇది ఒక నిదర్శనమన్నారు. ప్రభుత్వ పాఠశాలల పిల్లలు అన్ని అంశాల్లోను కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులతో సమానంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలవవాలన్నారు.

విద్యారంగానికి ప్రాధాన్యం

తిరువూరు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తిరువూరు జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు సోమవారం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎంపీ సత్యనారాయణ రాజు, నగర పంచాయతీ కో–ఆప్షన్ సభ్యుడు ఏరువ ప్రకాష్‌రెడ్డి, ముష్టికుంట్ల పీఏసీఎస్ చైర్మన్ గుడిపూడి నారాయణరావు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్ల పంపిణీ

తిరువూరురూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సోమవారం జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. కోకిలంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ గద్దల భారతి, ఆంజనేయపురం, రోలుపడి, గానుగపాడు, జీకొత్తూరు, చిట్టేల, లక్ష్మీపురం, మల్లేల, మునుకుళ్ల, అక్కపాలెం, వావిలాల, ఎర్రమాడు, పెద్దవరం, ముష్టికుంట్ల, కొమ్మిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నూజివీడులో..

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తయారు చేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అన్నారు. స్థానిక ఎస్ఆర్ఆర్ హైస్కూల్ విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన జగనన్న విద్యా కానుక కిట్లను సోమవారం చైర్‌పర్సన్ చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా త్రివేణీదుర్గ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, హెచ్‌ఎం భాగవతుల హేమలత పాల్గొన్నారు.

మండలంలోని గొల్లపల్లి హైస్కూల్లో విద్యా కానుక కిట్లను సర్పంచ్ బొకినాల వెంకటేశ్వరమ్మ సోమవారం విద్యార్థులకు అందజేశారు. విద్యా కమిటీ చైర్మన్ పల్లగాని వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం పొట్లూరి రాధికారాణి పాల్గొన్నారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అన్ని హంగులతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యను అందిస్తున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అని ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. కవులూరు, జి.కొండూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఆమె జెడ్పీటీసీ సభ్యుడు మందా జక్రధరరావుతో కలిసి జగనన్న విద్యా కానుక కిట్‌లను సోమవారం అందజేశారు.

మూలపాడులో..

మూలపాడు(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం వరుసగా నాలుగో ఏడాది పంపిణీ చేస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి అన్నారు. మూలపాడు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ఎంపీపీ పాలడుగు జోత్స్నతో కలిసి విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఎంఈఓ పుష్పలత, ఎంపీటీసీ సభ్యురాలు రాధ, హెచ్‌ఎం డేవిడ్ రాక్ ఫెల్లర్, సీఆర్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కె.తాడేపల్లి హైస్కూల్లో..

విజయవాడరూరల్: కొత్తూరు తాడేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుకల పంపిణీ కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు, పీఎంసీ చైర్మన్ షేక్ బాజీ, హెచ్‌ఎం కమలాకరరావు పాల్గొన్నారు.

మునునూరులో..

మునునూరు: ఏటేటా జగనన్న విద్యా కానుకతో పేద విద్యార్థుల ఉన్నత విద్యాభివృద్ధికి సమగ్ర చేయూత లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్ పేర్కొన్నారు. మునునూరు, రమణక్కపేట, గోపవరం, గుడిపాడు, వేల్పుచర్ల, చెక్కపల్లి, కాట్రేనిపాడు జిల్లా పరిషత్ హైస్కూళ్లలో సోమవారం నూజివీడు డీవైఈఓ సేవియా నాయక్ ఆధ్వర్యంలో హెచ్‌ఎంల అధ్యక్షతన చిన్నారులకు జగనన్న విద్యా కానుకల పంపిణీ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, సర్పంచ్‌లు కె.విజయలక్ష్మి, రంగు ధనలక్ష్మి గాంధీ, కంచర్ల వాణి, ఆర్.శ్రీదేవి శ్రీనివాస్, పుట్ల మోహనరావు,రాధిక, సుహాసిని, ఎస్ఎంసీ చైర్మన్లు రజని, సీహెచ్ రాటాలు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు టి.వెంకటేశ్వరరావు, టి.రంగారావు పాల్గొన్నారు.



మూలపాడులో కిట్లు స్వీకరించిన బాలికలతో జెడ్పీ వైస్ చైర్మన్ శ్రీదేవి



తిరువూరులో కిట్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు యరమల



కవులూరులో కిట్లను అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మీ తిరుపతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు జక్రధరరావు



నూజివీడులో విద్యాకానుక కిట్లను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ



కోకిలంపాడులో విద్యాకానుక కిట్లను అందజేస్తున్న ఎంపీపీ భారతి

కార్మికుల ఐక్యతకు బత్తుల కృషి

తిరువూరు: ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడ రేషన్ వ్యవస్థాపకులు బత్తుల సుధాకరరావు ఎనిమిదో వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక బస్టాండు ఆవరణలో సోమవారం నిర్వహించారు. కార్మికుల హక్కుల సాధనకు, ఐక్యతకు సుధాకరరావు విశేష కృషి చేశారని ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా నాయకులు బీవీరావు అన్నారు. బత్తుల చిత్రపటానికి డిపో కార్యదర్శి కేవీ రావు, సీఐటీయూ నాయకులు భద్రం, సత్యనారాయణ, నాగేంద్రప్రసాద్, సంజీవరావు, రంగారావు, విష్ణు, రాజు తదితరులు పూలమాల లు వేసి నివాళులర్పించారు. అనాథాశ్రమాల్లో అన్నదానం, ఆర్టీసీ కార్మికులకు, ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు.

మార్కెట్‌లోకి హోండా షైన్ 100 సీసీ

నూజివీడు: దేశంలోనే టూ వీలర్స్ అగ్రగామి సంస్థ అయిన హోండా మోటార్స్ అండ్ స్కూటర్స్ ఇండియా నుంచి 100 సీసీ వేరియంట్లో నూతనంగా వచ్చిన షైన్ 100సీసీ వాహనాన్ని నూజివీడు మార్కెట్లో సోమవారం లాంచ్ చేశారు. స్థానిక వీ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో హోండా మోటార్స్ జోనల్ మేనేజర్ శరద్ ఉంగ్రే, జోనల్ మేనేజర్ కస్టమర్ సర్వీస్ రాహుల్ కుమార్‌లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ అందుబాటు ధరలో చక్కటి మైలేజ్ వచ్చే బైక్ షైన్ 100 సీసీ అని కస్టమర్లకు వివరించారు. కార్యక్రమంలో శివాని హోండా, విహారి హోండా, ఐశ్వర్య హోండా, స్పందన హోండా షోరూంల యజమానులు పాల్గొన్నారు.



హోండా షైన్ 100 బైక్‌ను లాంచ్ చేసిన హోండా కంపెనీ ప్రతినిధులు

ప్రారంభంరోజే విద్యాకానుక అందజేయడం అభినందనీయం

విస్సన్నపేట: వేసవి సెలవులు ముగిసి పాఠశాలలు పునః ప్రారంభం రోజే విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యం అని ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి అన్నారు. స్థానిక తిరుపతమ్మపేటలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యాకానుక పంపిణీ ఎంపీపీ చేతుల మీదుగా సోమవారం నిర్వహించారు. సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కుటుంబరావు పాల్గొన్నారు.



తిరుపతమ్మపేటలో విద్యాకానుక కిట్లు అందజేస్తున్న ఎంపీపీ వనజాక్షి

ఎమ్మార్పీఎస్ కన్వీనర్‌గా మల్లేశ్వరరావు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్‌గా మంచాల మల్లేశ్వరరావు ఎన్నికయ్యారు. స్థానిక రాజుపేటలో జరిగిన నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర, జిల్లా కో–కన్వీనర్లు మానికొండ శ్రీధర్, మారబత్తుల గోపాల్‌లు కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు. తిరువూరు పట్టణ, మండల కన్వీనర్లుగా మాదాసు టైటస్, కన్నెపోగు ప్రసన్నకుమార్, ఏకొండూరుకు వెంపాటి డైమండ్, గంపలగూడెంకు మేరుగు సంపత్‌కుమార్, విస్సన్నపేటకు కొలికపోగు రంజిత్‌కుమార్ నియమితులయ్యారు.

లయన్స్‌క్లబ్ కార్యవర్గ ఎన్నిక

తిరువూరు: తిరువూరు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. బైపాస్‌రోడ్డులోని లయన్స్‌క్లబ్ భవనంలో జరిగిన ఎన్నికలో అధ్యక్షుడిగా అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా శ్యాంసుందర్ నాగుబండి, కోశాధికారిగా చింతల వెంకటరెడ్డి ఎన్నికయ్యారు.

ఘనంగా కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ట

నూజివీడు: మండలంలోని జంగంగూడెం యానాదుల కాలనీలో సోమవారం కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు రూ.10 లక్షల సాయంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరి విష్ణు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార గ్రామాల్లో తమ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు 822 ఆలయాలు ప్రతిష్ఠ చేశామన్నారు. దళితులు వేదమంత్రాలు నేర్చుకుని గర్భగుడిలో పూజలు చేయాలని ఆకాంక్షించిన అంబేడ్కర్ ఆశయాన్ని కొనసాగిస్తామన్నారు. జిల్లా సహ కన్వీనర్ పాటిమళ్ల కిషోర్, జిల్లా ధర్మ ప్రచారక్ భూపతి, సబ్‌డివిజన్ కన్వీనర్ కదం శ్రీను, ధర్మ ప్రచారక్ పరమేష్, దేవలయ కమిటీ అధ్యక్షుడు తులసి, సెక్రటరీ లక్ష్మి పాల్గొన్నార

టి.గన్నవరంలో..

టి. గన్నవరం(మైలవరం): మైలవరం మండలం చంద్రాల శివారు తుమ్మల గన్నవరంలో శ్రీసీతారామ, లక్ష్మణ, హనుమత్ స్వామివార్ల దేవస్థానం(రామాలయం)లో విగ్రహ, ధ్వజస్తంభం, నాభిశిల(బొడ్డురాయి) ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం సోమవారం కనుల పండువగా జరిగింది. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ స్వామిని దర్శించుకున్నారు.

జి.కొండూరులో..

జి.కొండూరు: మండలంలోని సున్నంపాడులో పునర్నిర్మించిన సీతారామస్వామి ఆలయం ప్రతిష్ఠా మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో సీతారామస్వామి విగ్రహాలు, దారుధ్వజ స్తంభం, విమానశిఖరం, బొడ్డురాయి ప్రతిష్ఠా కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. సర్పంచ్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

చాట్రాయి: అంగన్‌వాడీ కేంద్రాలపై అవగాహన కార్యక్రమం సోమవారం మండలంలోని చనుబండ గ్రామంలో నిర్వహించారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారం, బుక్స్ తదితరాలపై ర్యాలీ నిర్వహించారు. ఏఎన్‌ఎంలు, పీహెచ్‌సి సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి తరలింపునకు అనుమతులు తప్పనిసరి

చాట్రాయి: అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విశ్వనాథరావు హెచ్చరించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూములు, చెరువుల్లో మట్టిని తరలించాలంటే అనుమతులు పొందాలని పేర్కొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరించాలి

సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: స్పందన కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 11 అర్జీలు రాగా పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. ప్రతి అర్జీని గడువులోగా పరిష్కరించాలని, పరిష్కార నివేదికకు లబ్ధిదారుల సమస్యకు సంబంధించిన ఫొటోలను జతచేయాలని సబ్‌కలెక్టర్ పేర్కొన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. స్పందనలో ఏడీఏ విద్యాసాగర్, డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఆర్‌అండ్‌బీ డీఈ బాబూరావు పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలను తీసుకుంటున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

జగన్ నాయకత్వంలో ప్రగతి పథంలో మైలవరం

టి.గన్నవరం(మైలవరం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మైలవరం నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో పయనింపజేస్తున్నట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామ పంచాయతీ శివారు టి. గన్నవరంలో రూ.25 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాలు భవన నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం శంకుస్థాపన చేశారు. మైలవరం నియోజకవర్గం వ్యాప్తంగా రికార్డు స్థాయిలో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టినట్లు ఎమ్మెల్యే వసంత తెలిపారు. ప్రజా ప్రయోజనాల కోసం ఇక్కడ కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా వైఎస్సార్ ప్రభుత్వ పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జేజ్యోతి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గంగాధరరావు, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తిరుపతిరావు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్

పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మెల్యే రక్షణనిధి

ఊటుకూరు(గంపలగూడెం): పేదల పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం ఊటుకూరులో సోమవారం మూడవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన కొనసాగించారు. గ్రామంలోని కృష్ణనగర్ కాలనీలోని పలు వీధుల్లో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించి, ముద్రించిన బ్రోచర్లను పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి మరింతగా జరగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోమారు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాల్సి ఉందన్నారు. ఊటుకూరు పీఏసీఎస్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు ఆలపాటి ఉమామహేశ్వరరావు, ఎంపీపీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు శామ్యూల్, ఉపసర్పంచ్ రాఘవయ్య, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు సీహెచ్ నర్సారెడ్డి, చెన్నకేశవరెడ్డి, డీఎస్ఆర్, ఆర్ మాధవరావు, వైకుంఠం, ఎంపీడీఓ పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

ముసునూరు: బాలలందరినీ చదివించడం ద్వారా బాల కార్మిక వ్యవస్థకు చెక్ పెడదామని సింజెంటా మొక్కజొన్న విత్తన కంపెనీ ప్రొడక్షన్ మేనేజర్ చెన్నారెడ్డి పేర్కొన్నారు. ముసునూరు మెయిన్ ప్రాథమిక పాఠశాలలో కంపెనీ ఆర్గనైజర్ కె.రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో హెచ్‌ఎం హన్నామణి అధ్యక్షతన ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కంపెనీ ప్రతినిధులు పుష్పగుచ్ఛాలతో బాలలను బడిలోనికి ఆహ్వానించి, శుభాకాంక్షలు తెలిపి, బహుమతులు అందజేశారు. అనంతరం బాలలందరినీ చదివిద్దాం బాల కార్మిక వ్యవస్థను రూపుమాపుదాం అంటూ కంపెనీ ప్రతినిధులు, చిన్నారులు మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమాల్లో కేఎన్‌వీ ప్రసాద్, ఎస్. మురళి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.



ముసునూరులో మానవ హారం నిర్వహిస్తున్న రైతులు, విద్యార్థులు

నేడు ప్రభుత్వ ఆస్పత్రి భవనం ప్రారంభం

మైలవరం: మైలవరంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆస్పత్రి భవన నిర్మాణ సముదాయాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జీ వెంకట్రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, ప్రభుత్వ విప్ జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, నందిగామ ఎమ్మెల్యే ఎం. జగన్‌మోహన రావు, కలెక్టర్ ఢిల్లీరావు పాల్గొంటారని పేర్కొన్నారు.